క్లుప్తంగా

రాజీనామా



భూపాలపల్లి రూరల్/మొగుళ్లపల్లి: మొగుళ్ల పల్లి మండలం ఎంపీపీటీసీ ఎర్రబెల్లి వనిత, పున్నంచందర్‌రావు ఎంపీటీసీ పదవికి రాజీనమా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తమ రాజీనామాను ఆమోదించాలని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మికి మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి వనిత మాట్లాడుతూ.. గ్రామంలో కొన్ని అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, పూర్తి స్థాయిలో పనులను చేయాలనుకున్నప్పటికి మండల ప్రజాప్రతినిధులు, గ్రామంలోని నాయకులు సహకరించలేదన్నారు. దళిత బంధు, బీసీబంధు, గృహ లక్ష్మిలాంటి పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో అధికారులు, ఉన్నత స్థాయి నాయకులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎంపిక చేయడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసిన తనకు తగిన గుర్తింపు లేనందున రాజీనామా చేస్తున్నానని రాజీనామాను ఆమోదించాలని పేర్కొన్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలిమెల: మహదేవ్‌పూర్, కాళేశ్వరం, పెద్దంపేట, సూరారం, సర్వాయిపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా నేడు (బుధవారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్న ట్లు పలిమెల జెఎల్‌ఎం శశికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిలివేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



నితిన్(ఫైల్)

వాజేడు: మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామానికి చెందిన గట్టి నితిన్(18) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేరూరు ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం .. చంద్రుపట్ల గ్రామానికి చెందిన నితిన్ గత కొన్ని రోజులుగా బైక్ కొని ఇవ్వమని తల్లి దండ్రులను కోరాడు. వారు కొనివ్వక పోవడంతో వారం రోజుల క్రితం పురుగుల మందును తాగాడు. దీంతో హనుమకొండలోని ఒక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి..

టేకుమట్ల: అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వెల్లంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెల్లంపల్లి గ్రామానికి చెందిన తుమ్మేటి నరసింహారెడ్డి(80) అనే వృద్ధుడు కొన్ని సంవత్సరాలుగా కీళ్ల నొప్పులు, నరాల బలహీనతతో బాధపడుతుండేవాడని, అనారోగ్య సమస్యలను తాళలేక ఈ నెల 6న ఇంట్లోని గడ్డిమందు తాగాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



ములుగు రూరల్: తనిఖీ చేస్తున్న పోలీసులు



వెంకటాపురం(కె)లో..



వాజేడులో..



పలిమెలలో..

ములుగు రూరల్: మండలంలోని పందికుంటక్రాస్, మదనపల్లి రోడ్డు వద్ద ములుగు ఎస్సై వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): అంకన్నగూడెం గ్రామ శివారులో వెంకటాపురం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వాజేడు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో పేరూరు ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలను నిర్వహించారు. మండల పరిధిలోని బీరమయ్య గుడి సమీపంలో జాతీయ రహదారిపై పేరూరు ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసుల వాహనాలను సోదలు చేశారు. ప్రయాణికుల బ్యాగులకు క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసు కున్నారు.

కాళేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఎస్సై జె.లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ వరకు గల అడవిలో రోడ్డు పొడవునా ఉన్న కల్వర్టుల్లో తనిఖీలు, సోదాలను మంగళవారం చేపట్టారు. ఆయన వెంట సీఆపెఫ్ పోలీసులు ఉన్నారు.

పలిమెల: ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలిమెల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై తమాషారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మంగళవారం విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. గోదావరి తీర ప్రాంత గ్రామాలలో కల్వర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. పలిమెల గ్రామంలో వాహనాల తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని రెండు వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. తీర ప్రాంతం, మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో సమస్యాత్మక ప్రాంతాలపైన నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భయపడకుండా ఎన్నికల్లో వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(కె): ఆదివాసీ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దానవాయిపేట గ్రామంలో రేగ గణేష్ అధ్యక్షతన గోండ్వాన సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధి, హక్కులు, చట్టాల అమలుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో పాలక పక్షాలకు ఆదివాసీలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటకృష్ణ, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సత్యం, లక్ష్మీ నారాయణ, సుదర్శన్, దామోదర్ తదితరులు ఉన్నారు.

మద్యం, గుడుంబా విక్రయిస్తే చర్యలు

టేకుమట్ల: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా ఇళ్లల్లో, బెల్ట్ షాపుల్లో మద్యం, గుడుంబాను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఎవరైనా బెల్ట్ దుకాణాల్లో మద్యం, గుడుంబాను విక్రయిస్తే కేసులు నమోదు చేసి, తహసీల్దారు ఎదుట బైండోవర్ చేస్తామని, అలాగే భవిష్యత్‌లో మరోసారి కేసులు నమోదైతే రూ.1లక్ష జరిమానా విధిస్తారని అన్నారు. మండలంలో ఎక్కడైనా మద్యం, గుడుంబాను విక్రయిస్తే 8712658125 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మల్హర్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు అందిస్తున్న సేవలు బీమా, సామాజిక భద్రత పథకాలు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలు, బర్ మోసాలపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్గనైజెషన్ హైద్రాబాద్ కళజాత వారిచే మాటలు, పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంకు మేనేజర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కళాశాల సిబ్బంది

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎనుకపల్లి గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజమున ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్‌మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టొద్దన్నారు. గ్రామంలోకి అనుమానితులు, కొత్త వ్యక్తులు ఎవరు వచ్చిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి

● భూపాలపల్లి డీఎస్పీ రాములు

చిట్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ రాములు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐ వేణుచందర్ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభలకు తలొగ్గకుండా ఓటు వేసినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నతంగా పరిగనింపబడుతుందన్నారు. మనతో పాటు ఇతర దేశాలకు స్వాతంత్ర్యం వచ్చిన కూడా మన చుట్టూ ఉన్న దేశాలు అనేక అవస్థలు పడుతున్నాయని, కానీ మన దేశం ఇంత మంచిగా ఉండానికి గల కారణం భారత రాజ్యాంగమే అన్నారు. ఈ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని కోరారు. ఓటర్లు తమ ఓటును నిర్భయంగా వేయాలని మీకు తోడుగా మేము ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సంజయ్, సీఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రావు, చిట్యాల, మొగుళ్లపల్లి, గణపురం, టేకుమట్ల, రేగొండ ఎస్సైలు జంగిలి రమేష్, జాడి శ్రీధర్, సుధాకర్, సాంబమూర్తి, మాధవ్, షాఖాన్, సివిల్ పోలీస్ సిబ్బంది, సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న డీఎస్పీ రాములు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

మహదేవపూర్: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలో కేంద్ర బలగాలతో మంగళవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌ను డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. గ్రామంలోని వీదుల గుండా తిరుగుతూ కవాతు నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఐ కిరణ్, కాటారం సీఐ రంజీత్ రావు, మహదేవపూర్ ఎస్సైలు రాజ్‌కుమార్, భవనిసేన్, కాళేశ్వరం ఎస్సై లక్ష్మణ్‌రావు, పలిమెల ఎస్సై తమాషా రెడ్డి, కాటారం ఎస్సై అభినవ్, కొయ్యూరు ఎస్సై నరేష్, మహాముత్తరం ఎస్సై సూధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'రాష్ట్రంలో నియంతృత్వ పాలన'



సమావేశంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో నియంతృత్వం, దేశంలో మతతత్వం రాజ్యమేలుతోందని తెలంగాణ ఉద్యమకారులు పేర్కొన్నారు. మంగళవారం భూపాలపల్లి కేంద్రంలో బాతాల రాజు భవన్‌లోని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల కోసం 12 వందల మంది విద్యార్థుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతుందన్నారు. రూ.1లక్షా30 వేల కోట్లు వెచ్చించి, కాళేశ్వరం మేడిగడ్డ వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టని, నాణ్యత లేకుండా నిర్మాణం చేయడం వలన ప్రాజెక్టు కుంగి పోయిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు వాళ్ల జెండా రంగులు వేరైనా ఆ రెండు పార్టీలు ఒకటేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు కర్ణాటక సమ్మయ్య, కామెర గట్టయ్య, పీక కిరణ్, రత్నం కిరణ్ చల్ల గురుగల సంజీవ్, అక్కల బాపు, వావిలాల లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వెకటాపురం(కె): వర్షాలు లేక వరి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని గిరిజన సంఘం నాయకులు, మాజీ జెడ్పీటీసీ వంకా రాములు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సీతరాంపురం, ముత్తారం, కలిపాక, తిప్పాపురం గ్రామాల్లో వరి పంటలను నష్టపోయిన పంట పొలాలను సీపీఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలు నష్టపోయిన గిరిజన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులతో సీతరామ్‌పురం గ్రామంలో సూమారు 150 ఎకరాల, ముత్తారం, కలిపాక, కొత్తగుంపు గ్రామాల్లో 500 ఎకరాల్లో రైతులు వరి పంట నష్టపోయారని అన్నారు. పంటలు నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు సర్వే చేయాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట నాగేశ్వరావు, గంగిన బోయిన కృష్ణ, రైతులు కన్నయ్య, ముత్తయ్య, శంకర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.



ఎండిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం మంగళవారం కొనసాగింది. గోవిందరావుపేట మండలంలోని సోమలగడ్డ, బొల్లెపల్లి, రాఘవపట్నం గ్రామాల్లో ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క ప్రచారం నిర్వహించారు. అలాగే ఏటూరు నాగారం మండలంలోని రోహీర్, శంకరాజుపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. అదే విధంగా ములుగు మండలంలోని యపలగడ్డ, దేవనగర్ గ్రామాల్లో ప్రచారంలో భాగంగా పత్తి చేనులో కూలీలకు కాంగ్రెస్ నాయకుడు రవీందర్ ఆధ్వర్యంలో పార్టీ ఆరు గ్యారంటీలను వివరించారు. వాజేడులో భద్రాచలం ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పొందెం వీరయ్య ప్రచారం చేపట్టారు. వెంకటాపురం(ఎం)లో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ సాంబారి సమ్మారావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సమ్మారావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద ఎల్లారెడ్డిపల్లెకు చెందిన సుమారు 25 మంది, బుర్గుపేటలో 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే నర్సింగాపూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోరిక హర్జినాయక్, ఎర్రబెల్లి గోపాల్‌రావు, మూడు తిరుపతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతి తరపున ప్రచారం చేపట్టారు. వెంకటాపురం(కె) మండలంలోని వెంగళరావుపేటలో బీజేపీ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి కుంజా ధర్మ తరపున ఆ పార్టీ నాయకడు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అలాగే ములుగు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి చందులాల్ తనయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్‌కు టికెట్ కేటాయించడంతో ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలో, మంగపేటలోని తిమ్మంపేట, రాజుపేట, మంగపేట, కమలాపురంలో ఆ పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. మంగపేట మండలంలోని పలు గ్రామాల్లో బీఎస్పీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి జంపన్న ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు




ఆర్థికసాయం అందిస్తున్న వెంకన్న

గోవిందరావుపేట: మండల కేంద్రానికి చెందిన సాంబశివరావు ఇటీవల మృతి చెందాడు. మృతుడికి దివ్యాంగులైన ఇద్దరు పిల్లలు ఉండడంతో అతడితో కలిసి 1990–91లో పదో తరగతి చదువుకున్న బాల్య మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.38 వేల నగదు అందజేశారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన సారంగం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు ఈర్ల వెంకన్న, జిల్లా నాయకుడు మెట్టు సురేష్‌లు పరామర్శించి రూ.రెండు వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నాయకులు రాజు, రఘు, రాజశేఖర్, రాకేష్, నరేష్, రమణాకర్ ఉన్నారు.

నియామకం



కాటారం: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా కొట్టె ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం నియామక ఉత్తర్వులు అందజేసినట్లు ప్రభాకర్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన శ్రీధర్‌బాబుతో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

గోవిందరావుపేట: ఎస్‌టీయూటీఎస్ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పని చేస్తుందని అని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్ అన్నారు. మంగళవారం మండలంలోని పస్రా గ్రామంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు జన్ను సామ్సన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా మధుసుదన్ హాజరై మాట్లాడారు. సంఘం అభివృద్ధికి సభ్యులు నిరంతరం శ్రమించాలని అన్నారు. అనంతరం మండల శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా కందిక రాజు, ప్రధాన కార్యాదర్శిగా జన్ను శ్యాంసన్, కోశాధికారిగా కోరగట్ల రాముర్తి, జిల్లా కౌన్సిలర్‌గా హేమలతలను నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యాక్రమంలో రాష్ట్ర కార్యాదర్శి సోలం కృష్ణయ్య, ఎన్నికల అధికారి సల్లూరి రమేష్ బాబు, ఎన్నికల పరిశీలకులు బత్తుల సతీష్ కుమార్, ప్రాథమిక సభ్యులు నరేందర్, రాంబాబు, స్వామి పాల్గొన్నారు.

'సాక్షి' మ్యాథ్స్ బీ కి విశేష స్పందన

హసన్‌పర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం మ్యాథ్స్ బీ ప్రాథమిక స్థాయి పరీక్ష నగరంలోని స్పైక్ ఇంటర్నేషనల్ స్కూల్, తాళ్లపద్మావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, లర్నస్ ల్యాండ్ హై స్కూల్, రామన్ హైస్కూల్, షైన్ హైస్కూల్, క్రియేటివ్ హైస్కూల్, సాయి ట్యూటోరియల్స్, వండర్ కిడ్స్‌తో పాటు వివిధ పాఠశాలల్లో మంగళవారం ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ 'సాక్షి' నిర్వహిస్తున్న మ్యాథ్స్ బీ పోటీ పరీక్షతో విద్యార్థులకు గణితంపై పట్టు పెరుగుతోందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను వెలికితీయడంలో 'సాక్షి' ఎప్పుడు ముందంజలో ఉంటోందని శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడానికి విద్యార్థులు 9505514424 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్ గుప్తా, సాక్షి బృందం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అభిప్రాయాలను వ్యక్తంచేశారు.



పరీక్ష రాస్తున్న రామన్ హై స్కూల్ విద్యార్థులు



భీమారంలోని స్పైక్ హై స్కూల్‌లో..

'సాక్షి' మ్యాథ్స్ బీ తో విజ్ఞానం పెరుగుతోంది



సాక్షి మ్యాథ్స్ బీ నిర్వహించిన పోటీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతోంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 'సాక్షి' ఆధ్వర్యంలో ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

- టి. హాసిని, 8వ తరగతి (క్రియేటివ్ స్కూల్)

ప్రతి అంశంపై పట్టు



సాక్షి మ్యాథ్స్ బీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల సరికొత్త విషయాలు తెలుసుకోగలిగా. ప్రతి అంశంపై పట్టు సాధించా. భవిష్యత్‌లో ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు మ్యాథ్ బీ ఎంత గానో దోహదపడుతోంది.

- సీహెచ్.దీక్షిత, 9వ తరగతి (తాళ్ల పద్మావతి స్కూల్)

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న సిబ్బంది

మల్హర్: మండలంలోని అడ్వాలపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. సీఐ ప్రశాంతి తెలిపిన వివరాల ప్రకారం.. అడ్వాలపల్లి అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి అక్రమంగా డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 1800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన సమ్మయ్య, రాజశేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.